సాక్షి ఖమ్మం

ఆదివారం । 9 । జూలై । 2023



'లైన్' దాటుతోందని ఆందోళన

డోర్నకల్ – మిర్యాలగూడెం రైల్వే లైన్ తుది సర్వేలో అలైన్‌మెంట్ మార్చడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

8లో



తాగునీటి సరఫరా నిలిపేస్తాం

జీపీ కార్మికులను సమ్మెను విచ్ఛిన్నం చేయాలని చూస్తే అత్యవసర సేవలనూ నిలిపేస్తామని సీఐటీయూ నేత భాస్కర్ హెచ్చరించారు.

8లో

గరిష్టం / కనిష్టం

34° / 25°

వాతావరణం

జిల్లా అంతటా ఆదివారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

జమలాపురం శ్రీవారికి ప్రత్యేక పూజలు



తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని శ్రీవారి పాదంతో పాటు స్వామి మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేకం చేశారు. అలాగే, శ్రీవారు, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించగా అర్చకులు వెంకటసుబ్రహ్మణ్యశాస్త్రి నిత్యకల్యాణం జరిపించారు. ఆతర్వాత తెలంగాణ, ఏపీ నుంచి భారీగా హాజరైన భక్తుల సమక్షాన స్వామి పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఈఓ జగన్మోహన్‌రావు, ప్రధాన అర్చకుడు శ్రీనివాసశర్మ, ఉద్యోగులు శ్రీనివాస్, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

పెద్దాస్పత్రిని వరించిన 'లక్ష్య' అవార్డు

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రికి లక్ష్య అవార్డు ప్రకటించారు. ఆస్పత్రిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో లేబర్ రూం, ఆపరేషన్ థియేటర్ల మెరుగైన నిర్వహణకు గాను ఈ అవార్డు లభించింది. నాలుగు నెలల క్రితం నేషనల్ క్వాలిటీ అసూరెన్స్ స్టాండర్డ్స్, లక్ష్య బృందం ఆస్పత్రిని పరిశీలించి రెండు విభాగాల్లో నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేయగా, శుక్రవారం లక్ష్య అవార్డు సర్టిఫికెట్‌ను జారీ చేశారు. ఈ అవార్డు కింద మూడేళ్ల పాటు రూ.4లక్షల చొప్పున ఆయా విభాగాల్లో అభివృద్ధికి గాను నిధులు విడుదల చేస్తారు. కాగా అవార్డు రావడానికి కృషి చేసిన వైద్యులు, ఉద్యోగులను మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, మెడికల్ సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు, ఆర్‌ఎంఓలు శ్రీనివాసరావు, అమర్‌సింగ్ అభినందించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న వ్యాక్సిన్ మేనేజర్ రమణ

కూసుమంచి: సీజనల్ వ్యాధుల విషయంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యాక్సిన్ మేనేజర్ సీహెచ్.రమణ సూచించారు. మండలంలోని భగవత్‌వీడు, నర్సింహులగూడెం గ్రామాల్లో శనివారం ఆయన వ్యాక్సినేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మలేరియా, డెంగీ, మెదడువాపు, డయేరియా నివారణకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, దోమల వ్యాప్తిని అరికట్టాలని సూచించారు. సీహెచ్‌ఓ వలీయుద్దీన్, ఉద్యోగులు కిరణ్, రాణి, మంగమ్మ, ఉపేంద్రారాణి తదితరులు పాల్గొన్నారు.

రేపు వరుణయాగం

ఖమ్మంగాంధీచౌక్: వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ కామేపల్లి మండలం పాత లింగాలలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో జిల్లా ధూప దీప నివేదన అర్చక సంఘం ఆధ్వర్యాన సోమవారం వరుణ యాగం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గణపతి పూజ, రుత్విక వరుణ జపం ఉంటాయని సంఘం బాధ్యులు తెలిపారు. ఈమేరకు ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నావజ్ఝల ప్రసాద్‌శర్మ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మునగలేటి రమేష్‌శర్మ, మరిగంటి భార్గవాచార్యులు కోరారు.

పాలేరు నుండి తాగునీటి సరఫరా నిలిపివేత

కూసుమంచి: మండలంలోని పాలేరు రిజర్వాయర్‌లో నీటిమట్టం రోజురోజుకు తగ్గుతుండడంతో తాగునీటి సరఫరాకు ఇక్కట్లు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం రిజర్వాయర్ నుండి మిషన్ భగీరథ ప్రాజెక్టుకు రోజుకు 125.6 క్యూసెక్కుల నీరు వదులుతున్నారు. తద్వారా ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలకు అందుతోంది. కానీ కూసుమంచి మండలంలోని 74 గ్రామాలకు ఇదివరకు నిర్మించిన పాత ప్రాజెక్టు ద్వారానే తాగునీరు సరఫరా చేస్తున్నారు. అయితే, ఇన్ టేక్‌వెల్‌కు ప్రస్తుతం నీరు అందకపోవడంతో అధికారులు పూడిక తీత పనులు చేపట్టారు. ఇందుకోసం సోమవారం నుండి 16వ తేదీ వరకు కూసుమంచి మండలానికి నీటిసరఫరా నిలిపివేస్తామని, సర్పంచ్‌లు ప్రత్యామ్నాయ ఏర్పాట్లుచేసుకోవాలని అధికారులు సూచించారు.



అంటు కట్టేందుకు సిద్ధంగా ఉన్న టెంక మొక్కలు

కోటి మొక్కల కోట!

కూసుమంచిలో విస్తరిస్తున్న మామిడి నర్సరీలు

- ఈ ఏడాది 70 నర్సరీలు, కోటి మొక్కల పెంపకం
- తెలంగాణ, ఏపీతో పాటు ఇతర రాష్ట్రాలకూ సరఫరా
- నాణ్యమైన మొక్కలు కావడంతో రైతుల నుంచి డిమాండ్

సండే స్పెషల్

సంప్రదాయ, వాణిజ్య పంటలకు బదులు ఉద్యాన పంటలపై పలువురు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఇందులో మామిడికి ప్రాధాన్యత ఇస్తుండగా.. నాణ్యమైన మొక్కలను ఎంచుకోవడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఈమేరకు జిల్లాలోని కూసుమంచి మండల గిరిజన రైతులు నర్సరీల ఏర్పాటుకు అడుగులు వేస్తున్నారు. ఒకరిని చూసి ఇంకొకరు ఇలా పదుల సంఖ్యలో నర్సరీలు ఏర్పాటు చేస్తుండగా గ్రాఫ్టింగ్(అంటు కట్టే విధానం)లో ప్రత్యేక శిక్షణ పొందుతుండడం విశేషం. తద్వారా ఇక్కడ నర్సరీల్లోని మొక్కల కోసం తెలంగాణ, ఏపీతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి రైతులే కాక వ్యాపారులు సైతం కొనుగోలుకు వస్తున్నారు. – కూసుమంచి

రైతులు.. కూలీలకు ఉపాధి

మండలానికి చెందిన పలువురు గిరిజన రైతులు నర్సరీల పెంపకంతో తాము ఉపాధి పొందుతూనే మరికొందరికి ఉపాధి కల్పిస్తున్నారు. ఇక్కడి నర్సరీల్లో అంటుకట్టి పెంచే మామిడి మొక్కలను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. మండలంలోని వివిధ గ్రామాలు, తండాలకు చెందిన గిరిజన రైతులు, యువకులు నర్సరీల ఏర్పాటుపై ఆసక్తి చూపుతున్నారు. ఫలితంగా నర్సరీలు ఏటా పెరుగుతుండగా మామిడి మొక్కలకు కేరాఫ్‌గా కూసుమంచి నిలుస్తోంది. ఈ ఏడాది మండలంలో 70వరకు నర్సరీలను ఏర్పాటు చేయగా అందులో సుమారు కోటి మామిడి మొక్కలు పెంచుతున్నట్లు అంచనా.



అంటుకట్టాక అమ్మకానికి సిద్ధంగా ఉన్న నాణ్యమైన మామిడి మొక్కలు

గ్రాఫ్టింగ్ నేర్చుకుని..

పలువురు గిరిజన యువకులు, నర్సరీల నిర్వాహకులు ఆంధ్రప్రదేశ్‌లోని కడియం, రాజమండ్రి ప్రాంతాలకు వెళ్లి గ్రాఫ్టింగ్(మొక్కలకు అంటు కట్టడం)లో ప్రావీణ్యం పొందుతున్నారు. అక్కడ కొన్నాళ్లు అనుభవం సాధించాక స్వస్థలానికి వచ్చి నర్సరీలు ఏర్పాటు చేస్తున్నారు. ఇక నర్సరీల ఏర్పాటుకు స్తోమత లేని వారు గ్రాఫ్టింగ్ ద్వారా స్థానిక నర్సరీల్లోనే ఉపాధి పొందుతున్నారు. ఒక్కో మొక్కకు అంటు కట్టినందుకు గాను రూ.1.50 నుంచి రూ.2 వరకు చెల్లిస్తారు. మేలురకం మామిడి చెట్ల పుల్లలను సేకరించి టెంకల్లో పెంచిన మొక్కలకు అంటుకట్టి నాణ్యమైన మామిడి మొక్కలను సిద్ధం చేయడమే ఇక్కడ నర్సరీ నిర్వాహకుల ప్రత్యేకత. ఒక్కో యజమాని రూ.5లక్షల నుండి రూ.50 లక్షల పెట్టుబడితో నర్సరీల నిర్వహణ చేపడుతుండడం విశేషం. ఇక్కడ మొక్కల గ్రాఫ్టింగ్, సస్యరక్షణ తదితర పనులతో వందలాది మంది కూలీలకు ఉపాధి లభిస్తోంది.

మంచి డిమాండ్

కూసుమంచి మండలంలో నాణ్యమైన మామిడి మొక్కలు లభిస్తాయనే పేరు ఉంది. మేలు రకం మామిడి మొక్కలను ఇక్కడి నర్సరీల్లో సిద్ధం చేస్తుండడంతో రైతులు ఏటా సీజన్‌లో ఇక్కడ బారులుదీరతారు. ఇక్కడి మొక్కలను చెన్నై, బెంగళూరు ప్రాంతాల వారితో పాటు సూర్యాపేట, నల్లగొండ, వరంగల్, సంగారెడ్డి, ఖమ్మం, సత్తుపల్లి, అశ్వారావుపేట, రాజమండ్రి తదితర ప్రాంతాల వారు ఆర్డర్లపై కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు.

ప్రభుత్వం తోడ్పాటు అందించాలి



నేను రెండు ఎకరాల్లో 3లక్షల మొక్కలు పెంచుతున్నా. కాలానుగుణంగా పెట్టుబడి భారీగా పెరుగుతున్నా పోటీతత్వంతో తగిన ఆదాయం రావడం లేదు. ప్రభుత్వం స్పందించి బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తే మరికొందరు నర్సరీల ఏర్పాటుకు ముందుకొస్తారు.

– బానోత్ సైదులు, నర్సరీ నిర్వాహకుడు, పాలేరు

నాలుగేళ్లుగా ఉపాధి పొందుతున్నా



నేను ఇరవై ఏళ్లుగా నర్సరీలో గ్రాఫ్టర్‌గా పనిచేస్తూ ఉపాధి పొందుతున్నాను. నాకు మొక్కకు రూ.2 చొప్పున ఇస్తారు. రోజుకు 800 వరకు మొక్కలకు అంటుకడతాను. కూసుమంచిలో నర్సరీలు ఎక్కువగా ఉండటంతో మాలాంటి వారి ఉపాధికి ఇబ్బంది లేదు.

– వదిత్య వెంకన్న, గ్రాఫ్టర్

చేవ లేని చేప!

- చెప్పింది ఓ రకం.. పెరిగాక చూస్తే మరో రకం
- మేలు రకాలుగా నమ్మబలుకుతున్న అధికారులు
- తీరా విలువ లేని రకాలతో మత్స్యకారులకు నష్టం



సైజ్ తక్కువ చేపలు (ఫైల్)



వైరా రిజర్వాయర్‌లో చేపలు పడుతున్న మత్స్యకారులు

వైరా: మత్స్యకారులు కులవృత్తితో ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆశిస్తున్న ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటున్నా అవి సత్ఫలితాలను ఇవ్వడం లేదు. ఇందుకు అధికారుల పట్టింపు లేని తనమే కారణమనే విమర్శలు వస్తున్నాయి. గత నాలుగేళ్లుగా వైరా రిజర్వాయర్‌లో మేలు రకం చేపలైన రవ్వ, బొచ్చె, గ్యాస్ కట్ రకానికి చెందిన చేపల పెంపకానికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వంద శాతం సబ్సిడీతో చేపపిల్లలు పంపిణీ చేస్తామని చెప్పడంతో మత్స్యకారులు ఆనందించారు. ఇంతలోనే అధికారులు చేరుకుని ఏడాదిలోగా చేప సుమారు రెండు కిలోలకు పైగా ఎదుగుతుందని చెప్పారు. తీరా చేపలు పట్టాక మత్స్యకారుల ఆనందం ఆవిరైపోయింది. అవేమీ డిమాండ్ ఉన్న చేపలు కాకపోవడంతో పాటు సైజు సరిగా లేకపోవడంతో మార్కెట్‌లో ధర పలకక నష్టపోయినట్లయింది.

విలువ లేని 'పాంప్లెట్'

అధికారులు చేపపిల్లలు వదిలే సమయాన అన్నీ డిమాండ్ ఉన్న రకాలేనని వెల్లడించారు. రవ్వ, బొచ్చె, గ్యాస్ కట్ పిల్లలుగా చెప్పడంతో పెరిగాక మంచి డిమాండ్ ఉంటుందని మత్స్యకారులు కూడా భావించారు. తీరా చేపలు పట్టే సమయాన మార్కెట్‌లో విలువ లేని పాంప్లెట్(గురక) రకం చేపలు పడుతుండడంతో మత్స్యకారులు నిరుత్సాహానికి గురవుతున్నారు. మార్కెట్‌లో బొచ్చె, రవ్వ, గ్యాస్‌కట్ రకానికి చెందిన చేపలు హోల్‌సెల్‌గా కిలో రూ.100 నుంచి రూ.150 వరకు ధర పలుకుతుండి. కానీ పాంప్లెట్ రకం చేపలకు రూ.40 కూడా ధర పలకపోవడం, ఎదుగుదల కూడా సరిగ్గా లేక నిరాశ ఎదురైంది.

ఏటా ఇదే పరిస్థితి

వైరా రిజర్వాయర్ జిల్లాలోని అత్యంత ప్రాధాన్యత కలిగిన జలాశయమని చెప్పాలి. ఇక్కడి రిజర్వాయర్‌లో ఏటా మత్స్యశాఖాధికారులు మేలు రకమని చేప పిల్లలు పోస్తున్నారు. కానీ వేట ప్రారంభమయ్యే సమయానికి ఆశించిన సైజు లేకపోవటం, అవి కూడా మార్కెట్‌లో డిమాండ్ లేని చేపలు పడుతుండడం గమనార్హం. దీంతో అటు మత్స్యకారులకు నిరాశ మిగులుతుండగా.. స్థానికంగా రిజర్వాయర్ ఉన్నా ప్రజలకు మేలు రకం చేపలు లభించడం లేదు.

రక్షణ చర్యలూ అంతంతే...

వైరా రిజర్వాయర్ పరిధిలో అధికారికంగా వైరా, కొణిజర్ల, ఏన్కూరు, తల్లాడ మండలాల పరిధిలో సుమారు 1,250 మంది మత్స్యకారులు సభ్యత్వం కలిగి ఉన్నారు. ఏటా చేపల వేట ప్రారంభమయ్యే సమయానికి గాలిదుమారం వస్తున్నా మత్స్యకారులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యతను అధికారులు విస్మరిస్తున్నారు. 2017లో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుల్లో నలుగురు మృతి చెందగా, 2018లో ఇద్దరు, ఈ ఏడాది ఇద్దరు గల్లంతై మృతి చెందారు. ఇదే పరిస్థితి ఏటా పునరావృతమవుతుండగా అధికారులు నష్టపరిహారంతో సరిపెడుతున్నారు. అలాకాకుండా మత్స్యకారులకు లైఫ్ జాకెట్లు అందించడంతో పాటు నాణ్యమైన తెప్పలు పంపిణీ చేసి శిక్షణ ఇస్తే మంచిదనే భావన వ్యక్తమవుతోంది.

జూనియర్ కెమిస్ట్ పోస్టులకు నేడు రాత పరీక్ష

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో ఖాళీగా ఉన్న జూనియర్ కెమిస్ట్ (ఇంటర్నల్) పోస్టులకు కొత్తగూడెంలోని సింగరేణి మహిళా కళాశాలలో ఆదివారం రాత పరీక్ష నిర్వహించనున్నట్లు పర్సనల్ జీఎం(వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కట్టా బసవయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చిలో నోటిఫికేషన్ ఇవ్వగా సింగరేణి వ్యాప్తంగా సుమారు 500 మంది దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. వీరిలో 492 మందికి హాల్‌టికెట్లు జారీ చేశామని, ఆయా అభ్యర్థులు సకాలంలో పరీక్షకు హాజరుకావాలని జీఎం బసవయ్య సూచించారు.

పెదవాగు పనుల పరిశీలన



మరమ్మతు పనులు పరిశీలిస్తున్న ఈఈ

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుమ్మడవల్లి సమీపాన పెదవాగు ప్రాజెక్ట్ గేట్లకు రూ.1.23 కోట్లతో మరమ్మతులు చేపడుతున్నారు. ఆయా పనులను నీటి పారుదల శాఖ ఈఈ సురేష్‌కుమార్ శనివారం పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేసిన ఈఈ, మరమ్మతు పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈ కృష్ణ, ఏఈ కేఎస్‌బీ.కృష్ణ పాల్గొన్నారు.

ఫెలోషిప్‌నకు ఎంపిక



క్రాంతికుమార్

సత్తుపల్లి: హిందూ మహాసముద్రంలో శబ్ద తరంగాలు గుర్తించేందుకు అధునాతన హైడ్రోకౌస్టిక్ టెక్నాలజీపై పరిశోధన కోసం ఆస్ట్రేలియాలో జరగనున్న ప్రో గ్రెస్ ఫెలోషిప్‌నకు సత్తుపల్లికి చెందిన డాక్టర్ చందా క్రాంతికుమార్ ఎంపికయ్యారు. ఆయన కేరళలోని కొచ్చిలో ప్రాజెక్టు సైంటిస్ట్‌గా పనిచేస్తూ దేశం తరఫున ఎంపికైనట్లు వెల్లడించా రు. సత్తుపల్లి నవభారత్ కళాశాల పూర్వ విద్యార్థి అయిన క్రాంతిని చైర్మన్ గాదె నర్సింహారెడ్డి, కరస్పాండెంట్ లింగారెడ్డి, డైరెక్టర్లు నర్సారెడ్డి, సత్యానారాయణ అభినందించారు.

మీరు ఆశీర్వదిస్తే సేవ చేస్తా

- త్వరలోనే పాదయాత్రకు పాలేరులో ముగింపు
- వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరించిన వైఎస్.షర్మిల



వైఎస్ విగ్రహాన్ని ఆవిష్కరించాక కేక్ కట్ చేస్తున్న వైఎస్.షర్మిల

ఖమ్మంరూరల్: అందరూ ఆశీర్వదిస్తే పాలేరు ప్రజలకు సేవ చేస్తానని.. పాలేరులో వైఎస్సార్ తరహా సంక్షేమ పాలన అందించడమే తన లక్ష్యమని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల వెల్లడించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా ఖమ్మం రూరల్ మండలంలోని కరుణగిరి సమీపాన వైఎస్సార్‌టీపీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన వైఎస్ విగ్రహాన్ని శనివారం షర్మిల ఆవిష్కరించి మాట్లాడారు. వైఎస్.రాజశేఖరరెడ్డి ప్రజల సంక్షేమానికి పాటుపడినందునే ప్రతీ ఇంట్లో దేవుడి ఫొటో పక్కన ఆయన ఫొటో పెట్టుకున్నారని తెలిపారు. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ప్రవేశపెట్టిన పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని గుర్తుచేశారు. వైఎస్సార్‌కు పాలేరుతో విడదీయరాని అనుబంధం ఉందని, ఆయన హయాంలో రైతులకు మేలు జరిగిందని తెలిపారు. కాగా, 3,800 కి.మీ. మేర పాదయాత్ర చేసిన తాను ఈ నెలలో పాలేరులో మళ్లీ మొదలుపెట్టి 4వేల కి.మీ. యాత్రను ముగిస్తానని చెప్పారు. పాలేరు మట్టి సాక్షిగా గతంలో చెప్పినట్లు ఎల్లప్పుడూ ప్రజల కోసమే పనిచేసి.. వారి వెన్నంటి నిలుస్తానని షర్మిల తెలిపారు. అనంతరం వైఎస్ జయంతి సందర్భంగా ఏర్పాటుచేసిన శిబిరంలో పలువురు రక్తదానం చేశారు. కాగా, కొత్తూరులోని వైఎస్సార్‌టీపీ నాయకుడు తోట చిన్న వెంకటరెడ్డి స్వగృహంలో జరిగిన వైఎస్సార్ జయంతి వేడుకల్లోనూ పాల్గొన్న షర్మిల కేక్ కట్ చేయగా, రిటైర్డ్ సీఐ, వైఎస్సార్‌టీపీ నాయకుడు మద్దెల ప్రసాద్ సతీమణి దశదిన కర్మకు హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అడుగడుగునా నీరాజనం..

దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహావిష్కరణకు వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు షర్మిల హాజరు కాగా పార్టీ నాయకులు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. గిరిజన మహిళలు సంప్రదాయ వస్త్రధారణతో నృత్యాలు చేస్తూ డప్పు వాయిద్యాల నడుమ షర్మిలకు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు రావెళ్ల కృష్ణారావు, గడిపల్లి కవిత, రామసహాయం నరేష్‌రెడ్డి, నంద్యాల రవీందర్‌రెడ్డి, తుంపాల కృష్ణమోహన్, తోట చిన్న వెంకటరెడ్డి, ధర్మసోత్ రాము, బత్తిని యాలాద్రి, కృష్ణ, ఆంజనేయులు, యండపల్లి వెంకయ్య, వాలూరి సత్యనారాయణ, వై.వీ.డీ.రెడ్డి, యాట శ్రీను, పసుపులేటి సైదులు, రూప్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న అభిమానులు

సంక్షేమ పథకాల ఘనత వైఎస్సార్‌దే..

దివంగత సీఎం జయంతి వేడుకల్లో మాజీ ఎంపీ పొంగులేటి



వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పించాక నినాదాలు చేస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్: తెలుగు ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలుచేసిన ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డికే దక్కుతుందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని ఖమ్మంలోని దంసలాపురం, రాపర్తినగర్ ప్రాంతాల్లో జరిగిన వేడుకల్లో పాల్గొన్న పొంగులేటి వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. అనంతరం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పక్కా ఇళ్లు, ఆసరా పెన్షన్లు, 104, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, రుణమాఫీ ఇలా అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలతో పేదల గుండెల్లో వైఎస్సార్ వెలుగులు నింపారని తెలిపారు. ఉమ్మడి ఏపీలో ఉత్తమ ముఖ్యమంత్రులు అనగానే ఎన్టీఆర్, వైఎస్.రాజశేఖర్‌రెడ్డి మాత్రమే గుర్తుకొస్తారని చెప్పారు. వైఎస్ కన్నుమూసి ఏళ్లు గడిచినా ఆయనను ప్రజలు స్మరించుకోవడానికి మంచి పనులే కారణమని తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలో రాజన్న తరహా పాలన రావాలంటే రాబోవు కురుక్షేత్ర యుద్ధంలో కాంగ్రెస్‌ను అధికారంలో తీసుకొచ్చేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పొంగులేటి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు మద్దినేని బేబి స్వర్ణకుమారి, తుళ్లూరి బ్రహ్మయ్య, ఎం.డీ.రఫీదా బేగం, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, మలీదు జగన్, మిక్కిలినేని నరేంద్ర, ముదిరెడ్డి నిరంజన్ రెడ్డి, ఎం.డీ.ముస్తఫా, మియాబాయ్, ఇమాం, కొప్పెర ఉపేందర్, బాణాల లక్ష్మణ్, బోడ శ్రావణ్‌కుమార్, మందడపు రామకృష్ణారెడ్డి, చావా శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రామయ్యకు వైభవంగా సువర్ణ తులసీ అర్చన

శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం



రాణి కుముదినిని సత్కరిస్తున్న ఆలయ ఈఓ

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారికి శనివారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, స్వామి వారి సన్నిధిలో జరిగే శాశ్వత నిత్యాన్నదానానికి ఏపీలోని రాజమండ్రికి చెందిన అన్నపూర్ణ, శేషగిరిరావు రూ.1.10 లక్షలు విరాళంగా అందజేశారు.

స్వామివారిని దర్శించుకున్న ప్రముఖులు

శ్రీ సీతారామచంద్రస్వామి వారిని కార్మిక శాఖ చీఫ్ సెక్రటరీ రాణి కుముదిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ రమాదేవి, అర్చకులు సంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికారు. అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకుని ఉపాలయాల్లో ప్రత్యేక పూజల అనంతరం పండితులు ఆమెకు వేదాశీర్వచనం అందజేయగా, ఈఓ రమాదేవి శాలువాతో సత్కరించి స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక అందించారు. టీఎన్‌జీఓస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ముత్యాల సత్యనారాయణ గౌడ్ కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ ఏఈఓ భవాని రామకృష్ణ, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు అమరనేని రామారావు, అసోసియేట్ అధ్యక్షుడు రామనరసయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీరబాబు, భద్రాచల యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు డెక్క నరసింహారావు గగ్గురి బాలకృష్ణ, ట్రెజరీ పడిగ నరసింహారావు అంజిబాబు, భాస్కర్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

ఆడబిడ్డలు అండగా నిలవాలి

● ట్యాంక్‌బండ్‌పై వాకర్లతో మాజీ ఎంపీ పొంగులేటి



ట్యాంక్‌బండ్‌పై జిమ్ చేస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్: 'అందరూ బాగున్నారా.. రాజకీయంగా నేను తీసుకున్న నిర్ణయం సరేనదేనా' అంటూ నగరంలోని లకారం ట్యాంక్‌బండ్‌పై మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వాకర్లు, సందర్శకులను ఆరా తీశారు. ట్యాంక్‌బండ్‌పై శనివారం సాయంత్రం కాసేపు పర్యటించిన ఆయన సరదాగా జిమ్ చేశారు. ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరిన విషయమై పలువురి అభిప్రాయాలు తీసుకున్నారు. మహిళలతో మాట్లాడుతూ ఆడబిడ్డలే తనకు అండ అని, గతంలో మాదిరిగా ఎప్పుడూ సహకరించాలని కోరారు.

జిల్లా ఉషూ జట్టు ఎంపిక



జిల్లా ఉషూ జట్టు

ఖమ్మంస్పోర్ట్స్: రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు గాను జిల్లా సబ్ జూనియర్, జూనియర్ ఉషూ జట్లను ఎంపిక చేసినట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి.పరిపూర్ణచారి తెలిపారు. ఆయా జట్లు ఈనెల 9 నుంచి నిజామాబాద్‌లో జరగనున్న పోటీల్లో పాల్గొంటాయని వెల్లడించారు. జిల్లా జట్లకు ఎంపికైన వారిలో టి.సాయిభవ్యశ్రీ, ఎస్కే సనాకౌసర్, జె.ప్రహర్షన్ పాల్, ఎస్కే వసీంఅక్రం, టి.సాయిమహర్ష్, కె.దేవామణికంఠ, బి.సియాన్‌రాజ్ నందన్, బి.జనీశ్‌రాజ్, వై.రుత్విర్, జి.సాత్విక్ ఉండగా, మేనేజర్‌గా ఈ.రవీందర్ వ్యవహరిస్తారని తెలిపారు.

ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో సమస్యలు పరిష్కరించండి



పనులపై సూచనలు చేస్తున్న జీఎం

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లిలోని కొమ్మేపల్లి ఆర్ అండ్‌ఆర్ కాలనీలో సమస్యలను వెంటనే పరిష్కరించాలని సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం షాలేం రాజు ఆదేశించారు. కొమ్మేపల్లి, చెరుకుపల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలను శనివారం పరిశీలించిన ఆయన కమ్యూనిటీ హాల్, జీఎం కార్యాలయం, అధికారుల క్వార్టర్స్ నిర్మాణ పనులపై సూచనలు చేశారు. ఆ తర్వాత క్యాంప్ కార్యాలయంలో బొగ్గు ఉత్పత్తి, ఓవర్ బర్డెన్, రక్షణ అంశాలపై ప్రాజెక్టు అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో అధికారులు ఎస్.వెంకటాచారి, నర్సింహారావు, రామకృష్ణ, జీవీ రావు, బాషా, దేవదాసు పాల్గొన్నారు.

11న 'సీత్లా భవానీ' వేడుకలు

ఖమ్మంఅర్బన్: బంజారాల(గిరిజనుల) ప్రకృతి పండుగ అయిన సీత్లా భవానీ వేడుకలను ఈనెల 11న ప్రతీ తండాలో నిర్వహించనున్నట్లు అఖిల భారత గిరిజన సంఘం నాయకుడు బానోత్ గోపి తెలిపారు. ఏటా ఆషాఢ మాసంలో ఈ పండుగ నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోందని పేర్కొన్నారు.

రెండు ఆటోలు ఢీ.. నలుగురికి గాయాలు




ఘటనాస్థలంలో బోల్తా పడిన ఆటో

కూసుమంచి: మండలంలోని చేగొమ్మ క్రాస్ రోడ్ వద్ద శనివారం రాత్రి రెండు ఆటోలు ఢీకొన్న ఘటనలో నలుగురు ప్రయాణికులు గాయపడ్డారు. ఖమ్మం నుండి కూసుమంచి వైపు ప్రయాణికులతో ఒక ఆటో, వాటర్ ప్లాంట్‌కు సంబంధించిన మరో ఆటో వస్తున్నాయి. ఈక్రమంలో చేగొమ్మ క్రాస్ వద్ద ఓవర్‌టేక్ చేసే క్రమంలో రెండు ఆటోలు ఢీకొనగా ప్రయాణికుల ఆటో పల్టీ కొట్టింది. దీంతో జర్పుల సురేష్, చెరకుపల్లి ఈదమ్మ, గుగులోత్ బాలాజీ, ధర్మసోత్ చాంది గాయపడగా వారిని ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

గంజాయి స్వాధీనం

భద్రాచలంఅర్బన్: గంజాయి తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేసి రూ.4లక్షలు విలువ చేసే 20 కేజీల సరుకు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక బ్రిడ్జి సెంటర్ వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో బైక్‌పై ఇద్దరు అనుమానాస్పదంగా వెళ్తుండగా తనిఖీ చేశామని సీఐ నాగరాజురెడ్డి తెలిపారు. ఒడిశాకు చెందిన రాజా బిసారి, రాజేష్ విశ్వాస్‌గా తేలగా గంజాయి లభించడంతో అరెస్ట్ చేశామని వెల్లడించారు.

'లైన్' దాటుతోందని ఆందోళన



రైల్వేలైన్ సర్వేతో అన్నదాతల్లో గుబులు

● 'డోర్నకల్ – మిర్యాలగూడ' తుది సర్వేకు అధికారుల కసరత్తు
● పంట భూములు కోల్పోయి రోడ్డున పడతామని రైతుల ఆవేదన
● సర్వేను అడ్డుకునేందుకు సిద్ధమవుతున్న అఖిలపక్షం

ఖమ్మంరూరల్: రెండు నెలల కిందట జిల్లాలోని ఖమ్మంరూరల్, నేలకొండపల్లి, ముదిగొండ మండలాల్లో రైల్వే లైన్ నిర్మాణం కోసం భూసేకరణకు ప్రైవేట్ ఏజెన్సీ సర్వే నిర్వహించింది. డోర్నకల్ నుంచి మిర్యాలగూడ వరకు నిర్మించే నూతన రైల్వే మార్గంపై కసరత్తు మొదలుపెట్టారు. అయితే, రైల్వే లైన్ తొలి సర్వేనే స్థానిక రైతులు అడ్డుకుని నిరసన తెలిపారు. ఎంపీ నామా నాగేశ్వరరావు దృష్టికి కూడా తీసుకెళ్లగా ఆయన రైల్వే మంత్రితో పాటు అధికారులకు లేఖలు రాశారు. ఇంతలోనే తుది సర్వే కోసం సహకరించాలని రైల్వేశాఖ ఉన్నతాధికారులు కలెక్టర్‌కు లేఖ రాయడంతో రైతుల్లో కలవరం మొదలైంది.

అప్పుడు అలా.. ఇప్పుడు ఇలా..

తొలుత మల్లెమడుగు రైల్వేస్టేషన్ నుంచి ఖమ్మం రూరల్ మండలంలోని పల్లెగూడెం, ముత్తగూడెం, ఏదులాపురం, మద్దులపల్లి, తెల్దారుపల్లి, ముదిగొండ మండలం మీదుగా జిల్లా సరిహద్దును దాటుతూ రైల్వేలైన్ నిర్మాణానికి ప్రతిపాదించారు. తొలి దఫా సర్వే కూడా ఈ మార్గంలోనే జరిగింది. తాజాగా విడుదల చేసిన ఆదేశాల ప్రకారం ఖమ్మం రూరల్ మండలంలోని దారేడు, జాన్‌బాద్‌తండా, గుండాలతండా, గూడూరుపాడు, ఎం.వెంకటాయపాలెం, ఆరెకోడు, ఆరెంపుల, బారుగూడెం, పొన్నేకల్, మద్దులపల్లి, తెల్దారుపల్లి, ముదిగొండ మండలంలోని లక్ష్మీపురం, మేడేపల్లి, ధనియాలగూడెం, కట్టకూరు, నేలకొండపల్లి మండలంలోని ఆరెగూడెం, ఆచార్లగూడెం, కోనాయిగూడెం, నేలకొడపల్లి, బోదులబండ, పైనంపల్లి మీదుగా రైల్వే లైన్ వెళ్తుందని వెల్లడించారు. ఇందుకోసం భూసేకరణ నిమిత్తం తుది సర్వే చేపట్టనున్నారు. కాగా, ఒక్క ఖమ్మంరూరల్ మండలంలోనే దాదాపు వెయ్యి ఎకరాల వరకు రైల్వేలైన్ కోసం అవసరమవుతుందని అంచనా. ఈ విషయం తెలియగానే రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇంతకాలం తాము పంటలు పండించుకుంటున్న భూముల్లో నుంచి రైల్వేలైన్ వెళ్తుందని తెలుసుకున్న వారు ఏం చేయాలో పాలుపోక ఆవేదన చెందుతున్నారు. ఈ ప్రాంత వ్యవసాయ భూములకు మంచి డిమాండ్ ఉండటంతో ప్రభుత్వం ఇచ్చే పరిహారం ఎటూ సరిపోదని.. ఆ డబ్బుతో ఇంకో చోట భూమి కొనుక్కోలేక ఉపాధి కోల్పోతామని వాపోతున్నారు.

అంతా సన్నచిన్నకారు రైతులే..

తుది సర్వే చేపట్టాలని నిర్ణయించిన గ్రామాలకు చెందిన రైతులంతా ఎకరం నుంచి ఐదు ఎకరాల లోపు ఉన్న వారే. ఈ కొద్దిపాటి భూమి కూడా రైల్వేలైన్ కోసం ఇస్తే తమ బతుకులు బజారున పడడం ఖాయమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూరగాయలు, ఆకుకూరలు, చిరుధాన్యాలు సాగు చేసుకుని కుటుంబాలను పోషించుకుంటున్న తాము ఈ భూమి కూడా ఇస్తే ఆత్మహత్యే శరణ్యమని చెబుతున్నారు. ఇప్పటికే జాతీయ రహదారులు, ఎస్ఆర్ఎస్పీ కాల్వల కోసం వందల ఎకరాలు ఇచ్చామని.. మిగిలిన కొద్ది భూమిని రైల్వేలైన్ కోసం ఇచ్చేందుకు సిద్ధంగా లేమని రైతులు తెగేసి చెబుతున్నారు. ఎట్టి పరిస్థితుల్లో భూములు వదులుకోబోమని చెబుతూ రైతులంతా సంఘటితమై అఖిలపక్షం నాయకులతో కలిసి ఆందోళనలకు సిద్ధమవుతున్నారు. నాయకులు ఉద్యమాల కార్యాచరణ రూపొందిస్తుండడంతో రైల్వేలైన్ తుది సర్వే ఎలా జరుగుతుందోననే చర్చ మొదలైంది.

రైల్వేలైన్‌కు భూములివ్వం..



ఇప్పటికే జాతీయ రహదారి కోసం ఉన్న నాలుగెకరాల్లో రెండు ఎకరాలు పోయింది. మిగతా రెండు ఎకరాలు రైల్వే లైన్ కోసం ఇస్తే ఇక మేం ఏం చేసి బతకాలి. వ్యవసాయం చేయడమే తప్ప మరే పని రాదు. భూమి పోతే రోడ్డున పడనున్నందున భూమి ఇచ్చే ప్రసక్తే లేదు.
–చల్లా నాగేశ్వరరావు, రైతు, ఎం.వెంకటాయపాలెం

లైన్ అలైన్‌మెంట్ మార్చాలి



వ్యవసాయ భూముల మధ్యలో నుంచి వెళ్లే రైల్వేలైన్ మాకెవరికీ అవసరం లేదు. గతంలో వేరే మార్గం నుంచి సర్వే చేసినా ఇప్పుడు అమాయక రైతుల భూముల్లో నుంచి వేసేందుకు సిద్ధమవుతున్నారు. అలైన్‌మెంట్ మార్చి రైతులకు నష్టం జరగకుండా చూడాలి.
–గుర్రం అప్పయ్య, అఖిలపక్షం నాయకుడు

సర్వేను అడ్డుకుంటాం..



మాకు ఇష్టం లేకుండా బలవంతంగా భూముల్లో అధికారులు సర్వే చేస్తే అడ్డుకుంటాం. ఇప్పుడు భూమి పోతే మరెక్కడా కొనే పరిస్థితి లేదు. ఒకవేళ తప్పని పరిస్థితుల్లో భూములు తీసుకుంటే మాకు ఇదే ప్రాంతంలో సాగుకు యోగ్యమైన భూమి ఇస్తేనే అంగీకరిస్తాం.
–రెంటాల నాగేశ్వరరావు, రైతు

వైఎస్సార్ సేవలు అజరామరం

కాంగ్రెస్ కార్యాలయంలో జయంతి వేడుకలు



వైఎస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దుర్గాప్రసాద్, నాయకులు

ఖమ్మంసహకారనగర్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దివంగత వైఎస్.రాజశేఖరరెడ్డి బడుగు, బలహీన వర్గాల వారికి చేసిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ అన్నారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం వైఎస్సార్ జయంతి సందర్భంగా చిత్రపటం వద్ద నివాళులర్పించాక దుర్గాప్రసాద్ మాట్లాడారు. ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రిగా వైఎస్ రాష్ట్రాభివృద్ధి, సంక్షేమానికి ఎంతో కృషి చేశారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ద్వారానే రాజన్న రాజ్యం మళ్లీ వస్తుందని చెప్పారు. అనంతరం రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వానికి సంబంధించి గుజరాత్ హైకోర్టు స్టే నిరాకరించడంపై కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమాల్లో నాయకులు పులిపాటి వెంకయ్య, నాగండ్ల దీపక్‌చౌదరి, రాయల నాగేశ్వరరావు, వడ్డే నారాయణరావు, దొబ్బల సౌజన్య, బొందయ్య, మొక్కా శేఖర్‌గౌడ్, మద్ది వీరారెడ్డి, కొత్తా సీతారాములు, బాలాజీనాయక్, మిక్కిలినేని నరేందర్, పెంద్ర అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా, విద్యుత్ సేవలనూ నిలిపేస్తాం



సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

నేలకొండపల్లి: సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులను బెదిరించాలని చూస్తే తాగునీటి సరఫరా, విద్యుత్ సేవలను కూడా నిలిపేస్తామని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని కార్మికుల సమ్మె శిబిరాన్ని శనివారం సందర్శించిన ఆయన మాట్లాడారు. పీఆర్సీ నివేదిక ప్రకారం కార్మికులకు రూ.19 వేలు ఇవ్వాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దీంతో పాటు ఇతర సమస్యల పరిష్కారం కోసం సమ్మెకు దిగితే తాత్కాలిక కార్మికులను నియమించేందుకు ప్రభుత్వం యత్నిస్తోందని ఆరోపించారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించకపోతే అత్యవసర సేవలు కూడా నిలిపేసి సమ్మెను ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి విష్ణు, నాయకులు పగిడికత్తుల నాగేశ్వరరావు, రహీమతుల్లా, నాగరాజు, బొడ్డు ఆంజనేయులు, కస్తాల గోపయ్య తదితరులు పాల్గొన్నారు.

రైళ్ల రద్దు పొడిగింపు

కొత్తగూడెంఅర్బన్/ఖమ్మంమామిళ్లగూడెం: ట్రాక్ మరమ్మతుల కారణంగా పలు ప్యాసింజర్ రైళ్లను రద్దు చేసిన దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఈ పొడిగింపు మరికొద్ది రోజులు అమల్లో ఉంటుందని వెల్లడించారు. షెడ్యూల్ ప్రకారం రైళ్ల ఆదివారం ప్రారంభం కావాల్సి ఉన్నా పనులు పూర్తి కాకపోవడంతో 16వ తేదీ వరకు రైళ్లను రద్దు చేస్తున్నామని ఖమ్మం సీసీఐ జాఫర్, కొత్తగూడెం చీఫ్ కమర్షియల్ సూపర్‌వైజర్ జేమ్స్‌పాల్ తెలిపారు. డోర్నకల్–విజయవాడ (07755), విజయవాడ–డోర్నకల్(07756), భద్రాచలంరోడ్ – విజయవాడ(07278), విజయవాడ– భద్రాచలం రోడ్(07279) రైళ్ల నడవవనే విషయాన్ని గమనించాలని సూచించారు.

అక్రమంగా తరలిస్తున్న బెల్లం స్వాధీనం



వాహనం, నిందితులతో ఎక్సైజ్ అధికారులు

ముదిగొండ/నేలకొండపల్లి: అక్రమంగా తరలిస్తున్న బెల్లం వాహనాన్ని నేలకొండపల్లి ఎక్సైజ్ సర్కిల్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ముదిగొండ మండలం వల్లభిలో శనివారం తెల్లవారుజామున ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ నుంచి మహబూబాబాద్ జిల్లాకు బెల్లం, పటిక తరలిస్తున్న వాహనం పట్టుబడింది. 2,280 కేజీల నల్లబెల్లం, పది కేజీల పటికతో పాటు ఐదు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని బానోత్ వేలాద్రి, రాంశెట్టి ప్రకాష్, బర్మా నాగరాజును అదుపులోకి తీసుకున్నారు. తనిఖీల్లో నేలకొండపల్లి ఎక్సైజ్ సీఐ ఆర్.విజేందర్, ఎస్ఐలు బి.శంకర్, సిబ్బంది పి.శ్రీనివాసరావు, రామారావు, ఎం.లాలు, హరీశ్‌కుమార్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడు మృతి



ప్రవీణ్‌నాయక్ (ఫైల్)


నేలకొండపల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మండల కేంద్రానికి చెందిన పగిళ్ల గణేశ్ (23) మూడు రోజుల కిందట బైక్‌పై హైదరాబాద్ వెళ్తుండగా సూర్యాపేట సమీపాన జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఆయనకు సూర్యాపేటలో ప్రథమ చికిత్స చేయించాక హైదరాబాద్ తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు.

కల్లూరు మండలంలో...

కల్లూరురూరల్: కల్లూరు మండలం వాచ్యాతండాకు చెందిన చెందిన బానోతు ప్రవీణ్‌నాయక్ గతనెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. గత నెలలో బాసరకు వెళ్లి కారులో వస్తుండగా వైరా సమీపాన స్టేజీ పినపాక వద్ద లారీ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ప్రవీణ్ వదిన అంజలి, కూతురు స్వాతి, మామ అజ్మీరా రాంబాబు మృతి చెందిన విషయం విదితమే. ఘటనలో తీవ్రంగా గాయపడిన ప్రవీణ్‌కు హైదరాబాద్‌లో చికిత్స చేయిస్తుండగా మృతి చెందడంతో మృతుల సంఖ్య నాలుగుకు చేరింది. కాగా, కర్ణాటక రాష్ట్రంలో బ్యాంకు అధికారిగా ఉద్యోగం చేస్తున్న ఆయనకు ఏడాదిన్నర కిందట వివాహమైంది.

అతివేగమే కారణమా..?

● లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు
● బస్సు డ్రైవర్ అక్కడికక్కడే మృతి
● 15 మందికి తీవ్రగాయాలు
● రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు



మృతుడు కునుసోత్ భీమ్

అశ్వాపురం: మణుగూరు–కొత్తగూడెం ప్రధాన రహదారిపై వెళ్తున్న ఓ లారీని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో బస్సు డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన మండల కేంద్రంలో మంచికంటినగర్ వద్ద శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. కాగా, ఈ రోడ్డు ప్రమాదంపై శనివారం అశ్వాపురం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వరంగల్–2 డిపోకు చెందిన బస్సు వరంగల్ నుంచి విజయవాడ వైపు వెళ్తోంది. ఈక్రమంలో అశ్వాపురం సమీపంలో మంచికంటినగర్ వద్ద కోదాడ నుంచి బీజాపూరు వెళ్తున్న లారీని బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జనగాం జిల్లా కొడకండ్ల మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ కునుసోత్ భీమ్(55) అక్కడికక్కడే మృతి చెందగా 15మందికి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న అశ్వాపురం ఎస్ఐ సురేష్ సిబ్బందితో చేరుకొని క్షతగాత్రులను అంబులెన్స్‌లు, పోలీస్ వాహనంలో మణుగూరు ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సమయాన బస్సులో 30 మందికి పైగా ప్రయాణికులు ఉన్నట్టు సమాచారం. అందులో తీవ్ర గాయాలైన 15 మందిలో నలుగురికి హైదరాబాద్ తరలించారు. మణుగూరుకు చెందిన ప్రయాణికుడు సరెడ్డి శ్రావణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బంగారు గొలుసు చోరీపై కేసు నమోదు

సత్తుపల్లి: పట్టణంలోని కాకర్లపల్లి రోడ్డుకు చెందిన జంగాల నాగభూషణం ఇంట్లో చోరీ జరిగింది. శనివారం నాగభూషణం భార్య ఇంట్లో ఉండగా అద్దెకు ఇల్లు కావాలని నమ్మబలుకుతూ వచ్చి న వ్యక్తులు ఆమె మెడలోని బంగారు గొలుసును అపహరించుకువెళ్లారు. సుమారు రూ.1.90లక్షల విలువైన గొలుసు చోరీ జరిగినట్లు బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మోదీ పాలనలో అడుగడుగునా అన్యాయం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



జీపీ కార్మికుల సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

సింగరేణి(కొత్తగూడెం): ప్రధాని మోదీ పాలనలో తెలంగాణకు అడుగడుగునా అన్యాయం జరిగిందని.. బీజేపీ పాలిత రాష్ట్రాలకు నిధులు కేటాయిస్తూ తెలంగాణపై వివక్ష చూపుతున్నారని సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. విభజన హామీలు నెరవేర్చలేదని ఆరోపిస్తూ శనివారం కొత్తగూడెం బస్టాండ్ సెంటర్లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ, ములుగులో గిరిజన విశ్వవిద్యాలయం, కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా కల్పించకుండా తాత్సారం చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రజలను మభ్యపెట్టేందుకు వరంగల్‌లో శంకుస్థాపనలు చేశారని ఆరోపించారు.

కార్మికుల సమ్మెపై ప్రభుత్వం స్పందించాలి..

చుంచుపల్లి: రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి వారి డిమాండ్లు పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కోరారు. కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన నిరసన శిబిరాన్ని కూనంనేని సందర్శించి మాట్లాడారు. కనీస వేతనాల అమలు, పనిభద్రత, అర్హులకు పదోన్నతులు కల్పించే విషయంలో ప్రభుత్వం స్పందించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కే.సాబీర్‌పాషాతో పాటు సీపీఐ నాయకులు, కార్మిక జేఏసీ నాయకులు బండెల నర్సయ్య, గుత్తుల సత్యనారాయణ, వై.శ్రీనివాస్‌రెడ్డి, దమ్మాలపాటి శేషయ్య, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, గోవింద్, సలిగంటి శ్రీనివాస్, కె.రత్నకుమారి, పోలమూరి శ్రీనివాస్, అమర్, కిషోర్, సురేష్, బండ రామకృష్ణ, ప్రవీణ్, సలీం, వెంకన్న, ఆదిలక్ష్మి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కార వేదికగా సోషల్ మీడియా

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా సోషల్ మీడియాను ఉపయోగించుకుంటూనే మతోన్మాద శక్తుల తప్పుడు ప్రచారాన్ని ఎండగట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సూచించారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో సోషల్ మీడియా పదునైన ఆయుధంగా మారిందని తెలిపారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం, అధికారులకు చేరవేస్తూ పరిష్కారానికి పాటుపడాలని చెప్పారు. సమావేశంలో సీపీఎం నాయకులు బండి రమేశ్, వై.విక్రమ్, ఎస్.నవీన్‌రెడ్డి, పిట్టల రవి, బోడపట్ల కార్తీక్, పొన్నం వెంకటరమణ, ఉమేశ్, వెంకటేశ్వర్లు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె విరమణకు చొరవ చూపండి

ప్రజాపంథా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోటు రంగారావు



సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న రంగారావు

తల్లాడ: గ్రామ పంచాయతీ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించడం ద్వారా వారి సమ్మె విరమణకు ప్రభుత్వం చొరవ చూపాలని ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు డిమాండ్ చేశారు. తల్లాడలో గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె శిబిరాన్ని శనివారం సందర్శించిన ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్మికుల శ్రమకు తగిన వేతనం అందకపోవడమే కాక ఇతర సౌకర్యాలు వర్తించడం లేదని తెలిపారు. ఇకనైనా కనీస వేతనం అమలుచేయడంతో పాటు అర్హులకు పదోన్నతులు కల్పించాలని, ఎవరైనా మృతి చెందితే పరిహారం చెల్లించడమే కాక కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని రంగారావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సీవై పుల్లయ్య, ఎ.అశోక్, ఎస్కే లాల్‌మియా, డి.శ్రీనివాసరావు, సంగసాని హరి, వేలాద్రి, శ్రీహరి, నాగిరెడ్డి, వెంకటేశ్వర్లు, లాజర్, కృష్ణ, సత్యం, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

● త్రాసు మాయం !



మహిళ బొమ్మ చేతిలో త్రాసు (ఫైల్)



ఇప్పుడు త్రాసు లేకుండా...

ఖమ్మం వీడీఓస్ కాలనీలో అన్ని హంగులతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను రెండు నెలల క్రితం ప్రారంభించారు. అయితే, మార్కెట్ ఆవరణలో ఆకట్టుకునేలా బొమ్మలు ఏర్పాటుచేయగా.. కూరగాయలు తూకం వేస్తున్న ఓ మహిళ బొమ్మ కూడా ఉంది. ఈ బొమ్మకు జీవం పోసేలా ఆమె చేతిలో నిజమైన త్రాసు కూడా అప్పట్లో అమర్చారు. కానీ కొన్నాళ్లకే ఆ త్రాసు మాయమైంది! ఎవరైనా చిరువ్యాపారులకు అవసరం ఉండి తీసుకెళ్లారా.. ఆకతాయిలు ఎత్తుకెళ్లారో తెలియదు కానీ త్రాసు లేకపోవడంతో సదరు మహిళ బొమ్మ మాత్రం కళావిహీనంగా కనిపిస్తోంది. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్

సాక్షి సండే క్లాసిఫైడ్స్

Education

HOME TUTION
■ Venu Home Tutions : 1st to 10th all subjects, Inter, EMCET, IIT, JEE, Degree, B.Tech., Spoken English. Welcome to Tutors. 89196 56387, 95810 90860. [M-1221190]

ADMISSIONS
■ SSC పాస్/ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు శుభవార్త ! (ఉచిత విద్య) గ్రూపులు : MLT, MPHW (F), DMLT, DMPHA(M), D-Cardio. (Open SSC and Inter) అడ్మిషన్లు కలవు. ఖమ్మం-92472 34699. [M-1221336]

Services

గెల్లా హోమియో కేర్
■ అన్ని దీర్ఘకాలిక వ్యాధులకు హోమియో ఔషధం, గెల్లా హోమియో కేర్, మసీదు వద్ద, కమాన్ బజార్, ఖమ్మం. సంప్ర. డా॥ గెల్లా రాజేశ్వరరావు, సెల్ : 98661 85050. [M-1221337]

Wanted
■ శ్రీశ్రీశ్రీ హీరో షోరూం ఖమ్మం మరియు నేలకొండపల్లిలో వర్క్‌షాపు నందు పని చేయుటకు సూపర్‌వైజర్స్-2 వెంటనే కావలెను. సంప్ర. 63025 80288, 93983 94032. [M-1221198]

■ పిల్లల ఇంటివద్దనే ఉండి ఇంటిపని, వంటపని లేదా చిన్నపిల్లలను చూసుకొనుటకు ఆయాలు, బేబి కేర్‌టేకర్స్ అనుభవం గల వారు కావలెను. మంచిజీతం ✆ 78158 35561 / 91608 35559 [B-211]

■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376. [H-788703]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ:18K. Ph: 9640258899, 9640468899 [H-189303]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడివార్డెన్స్, ఆయాలు, భార్యభర్తలు, డ్రైవర్స్ కావలెను. Ph: 9391036931, 9246585901 [HA-11279]

■ VISA Consultation Overseas Blue & White Collar Jobs All Profiles Lucrative Salary Highpay. Interviews Vizag 9th to 11th July&Hyd. 13th&14th July. Ph: 9717618737 [HA-3289]

WANTED TEACHERS
■ లుంబిని స్కూల్ నందు ప్రైమరీ సెక్షన్‌లో పని చేయుటకు అసిస్టెంట్ టీచర్లు (Spoken English Must) వెంటనే కావలెను. ముస్తఫానగర్, ఖమ్మం. సెల్ : 83098 16861 [M-1221304]

■ English, Hindi (Nur. to 5th) Classes (Fluency English Must) మరియు ఆయాలు వెంటనే కావలెను. ఆకర్షణీయమైన జీతం. గాంధీచౌక్, ఖమ్మం. 93927 78297, 91005 40892. [M-1221324]

సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి
వివరాలకు : ఖమ్మం : 9010299957 9705444182

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.